భయం గుప్పిట్లో వైద్యం

- చిన్న పాండూరు పీహెచ్‌సీలో ప్రశ్నార్థకంగా రాత్రుల్లో వైద్యం
- సిబ్బందికి సెక్యూరిటీ సమస్య
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ
- బిక్కుబిక్కుమంటూ వైద్యం చేయలేమంటున్న సిబ్బంది



చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రిపూట వైద్యం రోజురోజుకు ప్రశ్నార్థకంగా మారుతోంది. కనీస భద్రత లేకుండా తాము వైద్యం చేయలేమంటూ సిబ్బంది తెగేసి చెబుతున్నారు. రూ.2కోట్లు వెచ్చించి గత ప్రభుత్వంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి నూతన భవనాన్ని నిర్మించారుకానీ అక్కడ వైద్యం చేపట్టే సిబ్బందికి మాత్రం భద్రత ఏర్పాట్లు ఆ శాఖాధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో 24 గంటలు స్థాయి కలిగిన ఈ ఆస్పత్రిలో రాత్రిపూట భద్రత లేనిదే వైద్యం చేయలేమని సిబ్బంది వాపోతున్నారు. అటు శ్రీసిటీ ఇటు ఏపీఐఐసీకి సంబంధించిన హీరో, అపోలో పరిశ్రమలు ఈ ఆస్పత్రికి సమీపంలో ఉండడంతో అటు స్థానికులతో పాటు పరిశ్రమల్లో పనిచేసే బయట ప్రాంతాలకు చెందిన కార్మికులు వైద్యం కోసం నిత్యం పదుల సంఖ్యలో ఆస్పత్రికి వస్తుంటారు. దీంతో రోగుల తాకిడి అత్యధికంగా ఉన్న చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రౌండ్ ది క్లాక్ ద్వారా చేపట్టాల్సి ఉంది.

పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ

రాత్రి వేళల్లో సెక్యూరిటీ సిబ్బంది నియామకం కోసం అనేకమార్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు ఆస్పత్రి వైద్యాధికారులు విన్నవించినా స్పందన లేదు. దీంతో అటు సిబ్బంది ఇబ్బందులకు సమాధానం చెప్పలేక అటు రాత్రివేళల్లో వైద్యం ఆపలేక తలలు పట్టుకుంటున్నారు. నూతన భవనం నిర్మించినప్పటికీ అందుకు భద్రతా సిబ్బందిని నియమించకపోవడంతో కూటమి ప్రభుత్వంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి వైద్యం కొనసాగింపునకు భద్రతా సిబ్బందిని నియమించాలని వైద్య సిబ్బంది పక్షాన స్థానికులు కోరుతున్నారు.

శ్రీసిటీ చొరవతో 15నెలలు సెక్యూరిటీ ఏర్పాటు

భద్రతా ఇబ్బందులతో చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందిపడుతున్న ఇబ్బందులను స్థానికుల ద్వారా గుర్తించిన శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డి స్వయాన తమ సొంత ఖర్చులతో శ్రీసిటీ ద్వారా 15నెలల పాటు రాత్రివేళల్లో సెక్యూరిటీ సిబ్బందిని నియమించి వైద్య సిబ్బంది భద్రతకు అండగా నిలిచారు. సెక్యూరిటీ సిబ్బందికి నెలసరి వేతనాలు సైతం శ్రీసిటీ యాజమాన్యమే చెల్లించింది. 2023 జనవరి నుంచి 2024 ఏప్రిల్ వరకు శ్రీసిటీ యాజమాన్యం సెక్యూరిటీని కొనసాగింపు చేశారు. తర్వాత శ్రీసిటీ యాజమాన్యం సెక్యూరిటీని ఉపసంహరించుకోవడంతో మరలా భద్రతా ఇబ్బందులు యథావిధిగా పునరావృతమయ్యాయి. దీంతో స్థానిక వైద్యాధికారులు పలు పరిశ్రమలకు విన్నవించినా స్పందన లేదు. దీంతో ఇటీవల దేశవ్యాప్తంగా అక్కడక్కడ వైద్యులపై జరుగుతున్న దాడులు, ఇతర ప్రతికూల పరిస్థితులను ప్రత్యక్షంగా చూస్తున్న వైద్య సిబ్బంది భద్రత లేనిదే వైద్యం కొనసాగించడం ఇబ్బందికరంగా మారుతుందని వాపోతున్నారు.

ప్రభుత్వానికి విన్నవించాం



24 గంటలు స్థాయి కలిగిన చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాత్రుల్లో భద్రత కోసం సెక్యూరిటీ సిబ్బంది అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు విన్నవించాం. వారు పరిశీలన చేస్తున్నారు. ప్రస్తుతం సెక్యూరిటీ సిబ్బంది లేనిది చాలా ఇబ్బందికరంగా మారుతోంది. రాత్రివేళల్లో వైద్య సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రాత్రివేళల్లో తాము విధులకు రాలేమంటూ స్టాఫ్ నర్సులు తెగేసి చెబుతున్నారు. తమ ఇబ్బందులను జిల్లా అధికారులు గుర్తించి తక్షణమే సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని కోరుతున్నాం.

–డాక్టర్ అనిత, ప్రధాన వైద్యాధికారిణి, చిన్నపాండూరు పీహెచ్‌సీ

భద్రతపై నిర్లక్ష్యమెందుకు?

రౌండ్ ది క్లాక్ స్థాయి కలిగిన చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రివేళల్లో కచ్చితంగా వైద్య సిబ్బంది వైద్యం చేపట్టాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రూ. 2కోట్లతో నిర్మించిన ఆస్పత్రి భవనం చిన్న పాండూరు ప్రధాన రోడ్డుకు కొంత లోపలికి ఉంది. దీంతో రాత్రివేళల్లో వైద్యులు మాత్రం విధులకు హాజరుకారు. ఒక మహిళా స్టాఫ్‌నర్స్, అటెండర్ మాత్రమే రాత్రివేళల్లో విధుల్లో ఉంటారు. దీంతో రాత్రివేళల్లో వైద్యం కోసం వచ్చే వారిలో అత్యధికంగా మద్యం తాగిన వారే అధికం. దీంతో వైద్యం కోసం వచ్చేవారు మద్యం మత్తులో విధులు నిర్వర్తిస్తున్న వైద్య సిబ్బందిపై దుర్భాషలాడుతుంటారు. ఆ సమయంలో ఏం జరుగుతుందోనని సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో రాత్రి 12 గంటలు దాటి వైద్యం కోసం వచ్చేవారికి ఏకంగా సిబ్బంది తలుపులు తీయలేని పరిస్థితి. గట్టిగా తలుపులు బిగించుకుని సిబ్బంది లోపలే ఉంటారు. రాత్రివేళల్లో సెక్యూరిటీ గార్డ్‌ను తమకు భద్రతగా నియమించాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.


రాత్రి విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

క్లుప్తంగా

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నేత మృతి


గోపిరాజు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం: మండలంలోని బీరకుప్పం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత గోపిరాజు (45) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి బీరకుప్పం గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లి గోపిరాజు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇతనికి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. నివాళుర్పించిన వారిలో నేతలు అపరంజిరాజు, చిన్నదొరై, బీరేంద్ర వర్మ, శ్యామ్, దానివేలు, దేశప్పన్ ఉన్నారు.

నేత్ర సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వండి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ పైడేశ్వరరావు

సత్యవేడు: ప్రతిఒక్కరూ కళ్లను కాపాడుకోకపోతే వారి జీవితం అంధకారమేనని శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు అన్నారు. ఆదివారం సత్యవేడు సన్‌రైజ్ హైస్కూల్‌లో ముదిరాజ్ సేవా సంఘం అధ్యక్షుడు మురళి ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాయల మిషన్ ఫర్ విజన్ పర్యవేక్షణలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ జ్ఞానేంద్రియంగా పిలవబడే కంటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. చెన్నై శంకర్ నేత్రాలయ వైద్యులు డాక్టర్ రాము, అరవింద్, ఆల్ఫోన్స్, మునివేలు బృందం 200 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 52మందిని ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు. 35 మందికి రాయితీపై కంటి అద్దాలు అందజేశారు. వీరికి చెన్నైలో మంగళవారం ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు మునిప్రతాప్, ఎంపీటీసీ సభ్యుడు బాలసుందరం, ముదిరాజ్ సేవా సంఘం ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సునిల్, రామారావు, ఎస్ఐ రామస్వామి, ఏఎన్ఎంలు లతాదేవి, మేరి, రోస్‌లిన్, సరస్వతి, లావణ్య, స్వాతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీఐటీయూ నూతన కార్యవర్గం ఎంపిక


కరీముల్లా

ఏర్పేడు: సీఐటీయూ మండల నూతన కార్యదర్శిగా కరీముల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మర్రిమండలో సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురవయ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. నూతన కార్యదర్శిగా కరీముల్లా, సభ్యులుగా రామకృష్ణ, మునిరెడ్డి, బాబు, కుమార్, భాగ్యలక్ష్మి, భాస్కర్, అన్నామలై ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా కరీముల్లా మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. రైతు సంఘం నాయకులు రంగయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజగోపాలపురం విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


పూజ


ఝాన్సీ

సత్యవేడు: మండలంలోని రాజగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కె.మణి తెలిపారు. చంద్రగిరిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఎస్.పూజ (10వతరగతి) వి.ఝాన్సీ (9వ తరగతి) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 2 నుంచి ఏలూరు జిల్లా పెదవేగిలో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం డి. రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

- సన్మానించిన ఎంపీ మద్దిల గురుమూర్తి


మురళిని సన్మానిస్తున్న ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు: సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీత, ఉత్తమ ఉపాధ్యాయుడిని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఘనంగా సన్మానించారు. మండలంలోని మన్నసముద్రం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు గుమ్మడి మురళి విద్యారంగం, సామాజిక సేవా రంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా ఇటీవల యువతేజం ట్రస్ట్, కలాం విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రధానం చేశారు. ఈనేపథ్యంలో ఆదివారం తమ స్వగ్రామమైన ఎంపీ గురుమూర్తిని తిరుపతిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ ఆయన్ను శాలువలతో సన్మానించి భవిష్యత్తులో మరిన్ని అవార్డులు పొందాలని హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, ప్రసన్నకుమార్, బాబు, కల్యాణ్, హరీష్ పాల్గొన్నారు.

తల్లికి మించిన దైవం లేదు

శ్రీకాళహస్తి: ప్రముఖ కవి, రచయిత, సీనియర్ పాత్రికేయులు మునిసురేష్‌పిళ్లై తల్లి భారతమ్మ సంస్మరణ సభ ఆదివారం పట్టణంలోని మహేష్ కల్యాణ్ సదన్‌లో జరిగింది. భారతమ్మతో పరిచయంగల 32 మంది ప్రముఖులు రాసిన మాటలతో మా ముద్దుల భారతమ్మ పుస్తకాన్ని సీనియర్ పాత్రికేయులు, రచయిత ఆర్‌ఎం ఉమామహేశ్వరరావు ఆవిష్కరించి తొలి ప్రతిని మునిసురేష్ పెద్దమ్మకు అందించారు.

జోరుగా వరి కోతలు


కల్లివెట్టులో వరిపంటను కట్ చేస్తున్న యంత్రం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్టువరత్తూరు, కారణి, కుక్కంబాకం, నెలవాయి, కల్లివెట్టు, తలారివెట్టు, వేణుగోపాలపురం గ్రామాల్లోని రైతులు జోరుగా వరికోతలు కోస్తున్నారు. ఈ గ్రామాల్లో ఈ సీజన్‌లో రైతులు 250 ఎకరాల్లో వరిపంటను సాగుచేశారు. బోర్లు, బావులున్న మెట్టభూముల్లో వరిపంటను వేశారు. పంటను ముందుగా వేయడంతో కోతలు తొందరగా కోస్తున్నారు. ఈ దఫా పంటలకు తెగుళ్లు తక్కువని, దీంతో పంటలకు పెట్టుబడి తగ్గిందని, ఎకరాకు 30 బస్తాలు కనుబడి వస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరిధాన్యానికి మార్కెట్‌లో ధర బాగా ఉండడంతో ఎకరా పంటకు అన్ని ఖర్చులు పోను రూ.25 వేలు మిగులుతుందని రైతులు అంటున్నారు. వరికోతల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు.

నేడు మహాజన సభ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని కాటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు మహాజన సభను నిర్వహిస్తున్నట్లు తిరుపతి అసిస్టెంట్ రిజిస్ట్రార్, అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ చిరంజీవిరెడ్డి, సీఈఓ మహేష్ తెలిపారు. సమావేశంలో ఏప్రిల్ 1, 2024 నుంచి ఆగస్టు 31, 2024 వరకు జరిగిన లావాదేవీలు, జమాఖర్చులు పరిశీలించి ఆమోదించడంపై, 2023–24 ఆడిట్ రిపోర్టు నివేదికలు పరిశీలన, ఆమోదించడంపై చర్చిస్తారన్నారు. సభ్యుల ఈకేవైసీ గురించి, వాయిదా పడిన రుణాల బకాయిల వంటి వాటిపై మహాజన సభలో చర్చిస్తామని తెలిపారు. సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు


దర్గాలో పూజలు చేస్తున్న ముస్లింలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న హజరత్ ఖ్వాజా సయ్యద్ షా జుంలేషా పీర్ ఖాదరవల్లి అల్లా ఉరుసు వార్షిక గంధోత్సవం ఆదివారం ముగిసింది. ఈ నేపథ్యంలో దర్గాలోని నిర్వాహకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంచిపెట్టారు. మత పెద్దలు, ఉరుసు కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఏఎస్‌ఐకి సన్మానం


జనార్దన్‌నాయుడును సన్మానిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న జనార్దన్‌నాయుడు ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన్ను శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆయన సేవలను కొనియాడారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ భరత్

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం పాఠశాలలో ఆదివారం పట్టణానికి భరత్ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ జూలుగంటి భరత్, డాక్టర్ దీపిక ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 120మందికి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పాఠశాల విద్యార్థులు 50మందికి నులిపురుగుల నివారణ మందులను అందజేశారు. సర్పంచ్ చెంచుకృష్ణమనాయుడు, కిరణ్‌నాయుడు, ధనమ్మ, సురేష పవన్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌లో..

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని రోటరీక్లబ్‌లో ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్ వివేక్ చైతన్య , ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్, వైద్యులు దినేష్, పవన్, లక్ష్మీప్రసన్న, రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని తుఫాన్‌సెంటర్‌లో పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు ఏడుకొండలు, లక్ష్మీనారాయణ, కిరణ రాఘవరెడ్డి, మృదుల, రాజేశ్వరరావు పాల్గొన్నారు.


రోటరీక్లబ్‌లో ఉచిత వైద్యశిబిరం

కండలేరులో 22.310 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 22.310 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,600 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయి గంగ కాలువకు 1150, పిన్నేరు కాలువకు 40, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు


ఆదిలక్ష్మీదేవి (ఫైల్)

రాపూరు: ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన శ్రీఆదిలక్ష్మీదేవికి 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 3వ తేదీ సాయంత్రం 6గంటలకు కలశస్థాపన, ఆదిలక్ష్మీదేవికి సౌభాగ్యలక్ష్మీదేవిగా అలంకరణ, 4న ఆదిలక్ష్మిదేవి అలంకరణ, 5న ధాన్యలక్ష్మి అలంకరణ, 6న ధైర్యలక్ష్మి అలంకరణ, 7న గజలక్ష్మి అలంకరణ, 8వ తేదీన సంతానలక్ష్మి అలంకరణ, 9న విద్యాలక్ష్మి అలంకరణ. 10న విజయలక్ష్మీ దేవి అలంకరణ, 11న ధనలక్ష్మి అలంకరణ, 12న విజయదశమి సందర్భంగా శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామికి అభిషేకం, పూలంగిసేవ, ఉదయం 8.30కి శ్రీవారు అశ్వావాహనంపై పారువేట, 9గంటలకు శమీపత్రపూజ, 11గంటలకు కల్యాణం జరుగుతుందని వివరించారు. శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజు అమ్మవారికి ఉదయం నవ కలశ స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, క్షేత్రోత్సవం నిర్వహిస్తామని వివరించారు.


పెంచలకోన క్షేత్రం

నాగలాపురంలో కుక్కల బెడద


వీధుల్లో గుంపులు గుంపులుగా ఉన్న కుక్కలు

నాగలాపురం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కుక్కల సంచారం వల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా కుక్కలు ఉండడంతో దారిన పోయే వారిపై దాడి చేసి కరుస్తున్నాయి. అంతేకాకుండా ద్విచక్ర వాహనదారులను వెంబడించి కరుస్తున్నాయి. దీని వల్ల ప్రమాదాలు బారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులు వీటిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విజయభారతి రచనలు చిరస్మరణీయం


విజయభారతికి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్ : స్త్రీల హక్కుల ఉద్యమ నేత, అంబేడ్కర్, పూలే జీవిత చరిత్రలను అక్షరీకరించిన విజయభారతి రచనలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం ఎమ్మార్‌పల్లెలోని ఆర్‌పీఐ కార్యాలయంలో రచయిత్రి విజయభారతి సంతాప సభ నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య మాట్లాడుతూ స్త్రీలు, దళితుల అణచివేతను తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన ఘనత విజయభారతిదేనన్నారు. పద్మభూషణ్ బోయ భీమన్న కుమార్తె, పౌరుహక్కుల ఉద్యమ నేత బొజ్జా తారకం సతీమణి డాక్టర్ బోయి విజయభారతి మరణం యావత్తు సమాజానికి తీరని లోటన్నారు. ఉస్మానియా వర్సిటీలో తెలుగులో డాక్టరేట్ పొందిన తొలి మహిళ విజయభారతి అని కొనియాడారు. ఆమె రచించిన షట్చక్రవర్తులు అనే పుస్తకం 2003లో కెనడాలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ మిషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అవార్డు దక్కించుకుందని వెల్లడించారు. కార్యక్రమంలో టీటీడీ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగు సంఘం అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చిన్నం కాళయ్య, ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు ఎ.సుబ్రమణ్యం, వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధి నడ్డి నారాయణ, బుద్ధవిహార్ అధ్యక్షుడు మునిరత్నం , కృష్ణయ్య, రాజమాణిక్యం, డాక్టర్ మహేష్ పాల్గొన్నారు.

డేంజర్.. డేంజర్


గోడలేని కల్వర్టు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు గ్రామం వద్ద కేటీ రోడ్డుకు ఉన్న చీటికాలువ కల్వర్టుకు ఇరువైపుల గోడలు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కల్వర్టుకు గోడలు లేకపోవడంతో వాహనాలు కల్వర్టులో పడిపోతున్నాయి. కల్వర్టు గోడలు దెబ్బతిని 10 సంవత్సరాలు కావస్తున్నా గోడలను నిర్మించాలన్న విషయాన్ని అధికారులు మరచిపోయారు. కల్వర్టు గోడలను నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

కండల వీరుడికి.. పతకాల దండ!


సాధించిన మెడల్స్, ప్రశంసాపత్రాలతో సునీల్


బాడీబిల్డర్ ప్రదర్శనలో సునీల్

సత్యవేడు: మండలంలోని కొల్లడం గ్రామానికి చెందిన సునిల్ తమిళనాడులోని పూందమల్లి సవిత యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. సునిల్ పోటీలో అడుగు పెట్టాడంటే పతకం పట్టాల్సిందే.. పాల్గొన్న ప్రతి పోటీలో విజయం సాధించాల్సిందే. అంత పట్టుదలతో రాష్ట్రస్థాయి వరకు బాడీబిల్డింగ్ పోటీలో అసమాన ప్రతిభ కనబరుస్తున్నారు. ఇటు ఆంధ్రా.. అటు తమిళనాడులో అదిరిందయ్యా అనిపించుకుంటున్నారు. మండలంలోని చెరివి పంచాయతీలోని కె.వెంకటరమణయ్య, కె.సెల్వి దంపతుల కుమారు కె.. సునీల్ శ్రీసిటీలోని చిన్మయ విద్యాలయంలో 1నుంచి 6వతరగతి వరకు, ఇంటర్ నారాయణ కాలేజ్, బీటెక్ సవిత యూనివర్సిటీలో చదువుతున్నాడు.

బాడీ బిల్డర్ శిక్షణ

తమిళనాడు పూందమల్లిలోని డార్క్‌నైట్ జిమ్ మాస్టర్ అజిత్ వద్ద 2021 శిక్షణ పొందాడు. తొలి దశ పోటీలోనే విజేత స్థానం దక్కింది. తమిళనాడులోని పట్టాబిరాంలో జరిగిన బాడీ బిల్డర్ పోటీలో పాల్గొని తృతీయ స్థానంలో, 2023లో మాధవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో తృతీయస్థానంలో విజేతగా నిలిచాడు. తమిళనాడు తిరువళ్లూరులో జిల్లాస్థాయి సదన్ క్లాసిక్ నిర్వాహకులు నిర్వహించిన బాడీ బిల్డర్ పోటీలో 20 మంది బిల్డర్లు పాల్గొన్నారు. ఆ పోటీలో తృతీయస్థానంలో నిలిచాడు.

సౌత్ ఇండియా పోటీలో ప్రథమ స్థానం

2024లో తమిళనాడులో జరిగిన సౌత్‌ఇండియా బాడీ బిల్డర్ పోటీలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. తిరుపతి జిల్లాకు, సత్యవేడు మండలానికి, సొంత గ్రామం కొల్లడంకు తమిళనాడులో పేరు వినిపించేలా బాడీ బిల్డర్ సునిల్ కృషి క్రమఫలించింది.

ప్రభుత్వం ఆదుకోవాలి

నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన సునిల్ ఉన్నత చదువు, క్రీడా పోటీల్లో రాణిస్తూ ప్రతిభ చాటుతున్న విద్యార్థిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకొని ఉన్నత చదువులు, క్రీడా ప్రతిభ చాటుకునేందుకు అవసరమైన శిక్షణ, ఆర్థికసాయం అందించాలని తల్లిదండ్రులు, స్నేహితులు కోరుతున్నారు.

చిన్నప్పటి నుంచే క్రీడల పట్ల ఆసక్తి

'చిన్నప్పటి నుంచి క్రీడల పట్ల ఆసక్తి ఉండేది. నా తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ఇంజినీరింగ్ చదువుతున్న కళాశాల అధ్యాపకులు నాలోని క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. లియోజిమ్ మాస్టర్ కవి ప్రోత్సాహంతో బాడీ బిల్డర్ పోటీల్లో రాణిస్తున్నా'నని సునీల్ తెలిపారు.